



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్, తదితరులు

పర్యావరణ పరిరక్షణ సామాజిక బాధ్యత

కలెక్టర్ ఓ.ఆనంద్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

సమాజంలోని ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు సామాజిక బాధ్యతగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ పిలుపునిచ్చారు. శుక్రవారం కలెక్టరేట్ మినీకాన్ఫరెన్స్ హాల్ లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్ డాక్టర్ కృష్ణయ్య (రిటైర్డ్ ఐఏఎస్ అధికారి)తో కలిసి సర్క్యులర్ ఎకనామి, వేస్ట్ రీసైక్లింగ్ పాలసీ (4.0) 2025-2030 పై సిమెంటు ప్లాంట్లు స్టీల్ పరిశ్రమలు టైర్ పైరోలిసిస్ యూనిట్లో ప్లాస్టిక్ వేస్ట్ రీసైక్లింగ్ యూనిట్ ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. జిల్లాలోని మున్సిపల్ కమిషనర్లు వివిధ ప్రాంతాల నుంచి పలువురు పరిశ్రమల యజమాన్య ప్రతినిధులు, స్వచ్ఛంద సేవా సంస్థలు, జిల్లా కాలుష్య నియంత్రణ మండలి శాఖ, డిఆర్‌డిఎ, పరిశ్రమల శాఖ, మెప్మా తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పారిశ్రామిక వాడలను రీసైక్లింగ్ చేయడానికి అన్ని చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. భావితరాలకు పచ్చనివాతావరణాన్ని అందించడమే లక్ష్యంగా కార్యక్రమాన్ని కొనసాగించాలని కోరారు. స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో కూడా వాతావరణ కాలుష్యం యొక్క ప్రాధాన్యత గురించి కార్యక్రమాలు చేపట్టామన్నారు. సమాజంలో కాలుష్య నియంత్రణకు ప్రజలు చైతన్యవంతులు కావాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర, జిల్లా స్థాయిలో పర్యావరణ పరిరక్షణ కోసం ప్రభుత్వం ప్రణాళిక బద్ధంగా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. స్వచ్ఛంద సేవా సంస్థలు కూడా ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలన్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో గ్రైనేట్ వ్యర్థాలను రీసైకిల్ చేసి విలువ ఆధారిత ఆదాయ వనరులుగా మార్చుకోవాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలోని మున్సిపాలిటీలలో ఉత్పత్తి చేసే మొత్తం ఘన వ్యర్థాలను సిమెంట్ బట్టీలలోని వ్యర్థాలను కోప్రాసెసింగ్ ద్వారా రీసైకిల్ చేయడమే ప్రధాన లక్ష్యం అన్నారు. రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్ కృష్ణయ్య మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దూరదృష్టితో తెచ్చిన ఈ పర్యావరణ పరిరక్షణ విధానం ద్వారా భవిష్యత్తు రోజుల్లో ఎంతో మేలు జరగనుందన్నారు. జిల్లాలో కూడా ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని కోరారు. అనంతరం పర్యావరణ పరిరక్షపై రూపొందించిన గోడపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కాలుష్య నియంత్రణ మండలి కిషోర్ రెడ్డి, ఏఈ కృష్ణారెడ్డి, డిఆర్‌డిఎ పీడీ శైలజ, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

రైతులను ముంచిన మొంథా



పొలంలోనే కుళ్లిపోయిన వేరుశనగ

అనంతపురం జిల్లాకు మొంథా తుఫాన్ ప్రభావం పెద్దగా లేకపోయినా అడపాదడపా కురిసిన ఓ మోస్తరు వర్షం రైతులను నట్టేట ముంచింది. ఖరీఫ్ సీజన్లో సాగు చేసిన వేరుశనగ, మొక్కజొన్న తదితర పంటల కోత అనంతరం పొలంలో ఉంచుకున్న రైతులను మొంథా తుఫాన్ నిండా ముంచింది. వర్షం దెబ్బకు కోత కోసిన పంట మొలకెత్తాయి. దీంతో రైతులు లబో దిబోమంటున్నారు.

ప్రజాశక్తి - శింగనమల



కాయలు లేని చెట్లను చూపుతున్న రైతు

తుఫాన్ కారణంగా పంటనష్టం
పొలాల్లోనే మొలకెత్తిన విత్తనాలు
చేతికొచ్చిన పంట నోటికందలేదంటూ రైతుల ఆవేదన

శింగనమల మండలంలోని ఆయా గ్రామాల్లో ఖరీఫ్ సీజన్లో 2754 హెక్టార్ల వేరుశన, 1046 హెక్టార్ల వరి, 401 హెక్టార్ల మొక్కజొన్న, 1106 హెక్టార్లలో కంది, 486 హెక్టార్లలో పత్తి, 255 హెక్టార్లలో ఆముదం, 28 హెక్టార్ల కొర్ర, 10 హెక్టార్లలో ఉలవ, 4 హెక్టార్లలో పెసర పంటలను రైతులు సాగు చేశారు. ప్రస్తుతం వేరుశగన, మొక్కజొన్న పంటలు చేతికొచ్చాయి. దీంతో రైతులు పంట కోత చేసి పొలాల్లో, కల్లాల్లో వేశారు. ఈ నేపథ్యంలో వచ్చిన మొంథా తుఫాను మండలంలోని రైతుల పాలిట శాపంగా మారింది. తుఫాన్ కారణంగా వర్షాలు రావడంతో పొలాల్లో, కల్లాల్లో ఉన్న పంట మొత్తం తడిసి ముద్దయిపోయింది. వేరుశనగ పంట అంతంతమాత్రంగా ఉందని ఇప్పుడు వర్షం వచ్చి పంట మొత్తం తడిచిపోవటంతో వేరుశనగ కాయలు మొలకెత్తుతున్నాయని రైతులు వాపోతున్నారు. పంట సాగుకు పెట్టిన పెట్టుబడి కూడా తిరిగి రాని పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరిపంటకు కూడా ఎండుతెగులు సోకిందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక కందిపంటపై కూడా ఆశలు లేవంటున్నారు. పత్తి పంటకు పురుగు, జీడి వచ్చిందని చెబుతున్నారు. పంటసాగుకు పెట్టిన పెట్టుబడి కూడా తిరిగి రాని పరిస్థితి ఉందని వాపోతున్నారు. ఉన్న అప్పులకు ఇవి కూడా తోడయ్యాయని, ఆరుగాలం శ్రమించినా తమకు అప్పులే మిగిలాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి

3 ఎకరాల్లో వేరుశనగ పంటసాగు చేశా. పంట దిగుబడి ఆశాజనకంగా కన్పించింది.అయితే తుఫాన్ కారణంగా కోతకోసం పంట మొత్తం తడిచిపోయింది. దీంతో పొలంలోనే వేరుశనగ కాయలు మొలకలెత్తాయి. పంటసాగుకు పెట్టిన పెట్టుబడి కూడా తిరిగి రానిపరిస్థితి నెలకొంది. కనీసం పశుగ్రాసం కూడా దక్కకుండా పోయింది. ప్రభుత్వం స్పందించి నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

ఆదినారాయణ,
రైతు, సలకంచెరువు

నష్టపరిహారం చెల్లించాలి

తుఫాన్ కారణంగా కురుస్తున్న వర్షంతో వేరుశనగ పంటసాగు చేసిన రైతులు తీవ్రంగా నష్టపోయారు. నష్టపోయిన రైతులను ఆదుకునే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. బాధిత రైతులకు తక్షణమే నష్టపరిహారం ఇవ్వాలి. రైతుల సంక్షేమమే తమ ప్రధాన ధ్యేయమని ప్రతి సమావేశంలో ఊదరగొడుతున్న కూటమి నాయకులు రైతుల సమస్యలపై దృష్టి సారించడం లేదు. ఇప్పటికైనా రైతులను ఆదుకోవాలి

భాస్కర్,
మండల కార్యదర్శి

నివేదికను పంపుతాం

తుఫాన్ కారణంగా మండలంలోని పలువురు రైతులకు చెందిన పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. వేరుశనగ, మొక్కజొన్న, వరి తదితర పంటలను రైతులు నష్టపోయియారు. నష్టం వాటిల్లిన పంటల వివరాలను సేకరిస్తున్నాం. ఏయే పంటకు ఎంతమేర నష్టం వాటిల్లిందో క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదిక తయారు చేసి ఉన్నతాధికారులకు నివేదిస్తాం.

అన్వేష్‌కుమార్,
మండల వ్యవసాయశాఖ అధికారి

తడిసిన మొక్కజొన్న

రంగుమారిన పంట - ఆందోళనలో అన్నదాతలు

ప్రజాశక్తి-బొమ్మనహాల్

ఇటీవల కురిసిన వర్షాలకు రైతులు నూర్పిడి చేసుకున్న మొక్కజొన్న పూర్తిగా తడిసిపోయింది.
దీంతో పంట రంగు మారడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. మండల పరిధిలోని బొమ్మనహాల్, దేవగిరి, ఉద్దేహాల్, మైలాపురం, కొత్తూరు, ఖానాపురం, నేమకల్లు, కురువల్లి, గోవిందవాడ, హొన్నూరు గ్రామాల్లో రైతులు ఎక్కువగా మొక్కజొన్న పంట సాగు చేశారు. ఆయా గ్రామాల్లో సుమారు 5వేల ఎకరాల్లో పంట సాగైంది. పంట చేతికి రావడంతో చాలామంది రైతులు కోసి ఆరబెట్టుకున్నారు. ఈనేపథ్యంలో దాదాపు ఐదారు రోజులు వర్షాలు కురవడంతో పంట పూర్తిగా తడిసిపోయింది. దీంతో పంట నల్లరంగులోకి మారిపోయిందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నల్లగా మారిన పంటను ఎవరు కొనుగోలు చేస్తారని భయపడుతున్నారు. మరోవైపు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మొక్కజొన్న పంటను కొనుగోలు చేస్తామని ప్రభుత్వాలు చెబుతున్నాయి తప్ప ఏర్పాటు చేయడం లేదని రైతుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధరతో మొక్కజొన్న పంటను కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.



తడిచిన మొక్కజొన్న పంట

తాగునీటి సమస్య లేకుండా చేస్తాం

ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్

ప్రజాశక్తి-అనంతపురం

ఉరవకొండలో మరో 25ఏళ్లపాటు తాగునీటి సమస్య లేకుండా చేస్తామని రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు. 'ఇంటింటికీ మంత్రి' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఉరవకొండలో మంత్రి పర్యటించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా పట్టణంలోని అంబేద్కర్ నగర్, ఇందిరానగర్, తదితర కాలనీల్లో పర్యటించి నేరుగా ప్రజల ఇంటి వద్దకే వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకుని పరిష్కరించాలని అక్కడికక్కడే అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ఉరవకొండలో మరో 25 ఏళ్ల తాగునీటి సమస్య లేకుండా చేసేందుకు ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. పట్టణంలో 30 ఏళ్ల కిందటి పైప్‌లైన్లు ఉన్నాయని, వాటిని మారుస్తామన్నారు. అవసరమైన డ్రెయినేజీలు ఏర్పాటు చేస్తామన్నారు. వర్షం వల్ల మగ్గం గుంతల్లో నీళ్లు వచ్చి ఉపాధి కోల్పోయామని పలువురు చేనేతలు తెలుపగా, వెంటనే ఫోన్ ద్వారా చేనేత జౌళి శాఖ ఎడితో మంత్రి మాట్లాడుతూ నష్టం నివేదికలను కలెక్టర్‌కు పంపించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.



మహిళలతో మాట్లాడుతున్న మంత్రి పయ్యావుల కేశవ్

అర్హులందరికీ గృహాలు : హౌసింగ్ పీడీ

బొమ్మనహాల్ : మండలంలోని అర్హులందరికీ ఇళ్లు మంజూరు చేయనున్నట్లు హౌసింగ్ పీడీ శైలజ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో హౌసింగ్ డిఇ రామ్మూర్తి, ఇంజినీర్ శ్రీకాంత్, ఎఇ వాసంతితో గృహాల మంజూరుపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మంజూరు చేసిన గృహాల విలువను బట్టి జియో టాకింగ్ చేయాలన్నారు. విడతల వారీగా నిర్మాణం బట్టి బిల్లులు మంజూరు చేయనున్నట్లు తెలిపారు.

పప్పుశనగ పంపిణీ

పుట్లూరు : రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులకు శుక్రవారం సబ్సిడీ పప్పుశనగను పంపిణీ చేశారు. గురువారం వందమంది రైతులు శనగల కోసం రిజిస్ట్రేషన్ చేసుకోక వారందరికీ పంపిణీ చేసినట్లు ఏవో కాత్యాయని తెలిపారు.

7 నుంచి రాష్ట్రస్థాయి రెవెన్యూ క్రీడలు : కలెక్టర్

ప్రజాశక్తి-అనంతపురం

నవంబర్ 7, 8, 9 తేదీల్లో జిల్లాలో నిర్వహించనున్న 7వ రాష్ట్రస్థాయి రెవెన్యూ క్రీడలు, సాంస్కృతిక ఉత్సవాలను విజయవంతం చేయాలని కలెక్టర్ ఓ.ఆనంద్ పిలుపునిచ్చారు. శుక్రవారం నగరంలోని కృష్ణ కళామందిర్‌లో ఇందుకు కు సంబంధించిన బెలూన్ ఎగురవేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ నగరంలోని ఆర్డీటీ స్టేడియంలో నిర్వహించనున్న క్రీడలకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ సెటిల్‌మెంట్ అధికారి జి.రామకృష్ణారెడ్డి, ఆర్‌డిఒ కేశవనాయుడు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఆనంద్, రామ్మోహన్, జిజిహెచ్ అడ్మినిస్ట్రేటర్ మల్లికార్జునరెడ్డి, రెవెన్యూ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు దివాకర్‌బాబు, సెక్రటరీ సోమశేఖర్, తహశీల్దార్ మోహన్‌కుమార్, స్పోర్ట్స్, కల్చరల్ అసోసియేషన్ ప్రెసిడెంట్, సెక్రటరీ సంజీవరెడ్డి, హరిప్రసాద్‌రెడ్డి, రెవెన్యూ క్రెడిట్ సొసైటీ ట్రెజరర్ సంజీవరాయుడు, తదితరులు పాల్గొన్నారు.

అబద్ధపు ప్రచారాలు చేయడం దుర్మార్గం

టిడిపి జిల్లా అధ్యక్షులు వెంకటశివుడు యాదవ్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

తుఫాన్ వల్ల రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే వైసిపి నాయకులు మాత్రం అబద్ధపు ప్రచారాలు చేయడం దుర్మార్గమని టిడపిఇ జిల్లా అధ్యక్షుల వెంకటశివుడు యాదవ్ అన్నారు. శుక్రవారం నగరంలోని టిడిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతు సంక్షేమం గుర్తించి మాట్లాడే అర్హత వైసిపికి లేదన్నారు. పంటల బీమాపై వైసిపి బ్యాచ్ నిస్సిగుగ్గా అబద్ధాలు చెబుతూ రైతుల్లో తీవ్ర ఆందోళనలు సృష్టించడం అన్యాయమన్నారు. ముఖ్యంగా జిల్లాలో రైతులను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం ఎప్పుడూ ముందుంటుందన్నారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం కింద గత ఖరీఫ్ సీజన్‌కు రూ.58.83కోట్లకుపైగా బీమా మంజూరైందని అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారన్నారు. కుంభకోణాల మయంలో గత వైసిపి తయారైందన్న విషయం మీకు గుర్తులేదా? అని ప్రశ్నించారు. జగన్ పాలనలో ధాన్యం కొనుగోలు చేయాలంటే 75 కిలోల ధాన్యం బస్తాకు రూ.100 నుంచి 200 వరకు అదనంగా వసూలు చేసింది మీరు కాదా..? అన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులు పూర్తిగా నిర్లక్ష్యం చేశారన్నారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అర్హులందరికీ విత్తనాలు పంపిణీ చేశామన్నారు. అన్నదాన సుఖీభవ - పిఎం కిసాన్ మొదటి విడత కింద జిల్లామొత్తంగా 2,75,642 మంది రైతులకు రూ.192.95 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశామన్నారు. అంతేగాకుండా హంద్రీనీవా విస్తరణ పనులు మొదలు పెట్టి యుద్ధ ప్రాతిపదికన మొదటి ఫేజ్ పనులు పూర్తి చేశామన్నారు. ఇవన్నీ చూసి ఓర్వలేని వైసిపి నాయకులు ప్రజలను దృష్టి మరల్చేందుకు డైవర్షన్ రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. ఈ సమావేశంలో టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి జి.శ్రీధర్‌చౌదరి, రాష్ట్ర పార్టీ కార్యదర్శి తలారి ఆదినారాయణ, ఎపి రాష్ట్ర బిసి సెల్ ప్రధాన కార్యదర్శి గంజే నాగరాజు, ఎపి కురుబ సాధికార సమితి రాష్ట్ర సభ్యులు నారాయణస్వామి పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న వెంకటశివుడు యాదవ్

'దుర్గం' యార్డులో గొర్రెలు, పశువుల సంత

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్

ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు చొరవతో కళ్యాణదుర్గంలోని మార్కెట్ యార్డులో ఎట్టకేలకూ గొర్రెలు, పశువుల సంత ప్రారంభమైంది. ఇంతకాలం పశువులు, గొర్రెలు, మేకలు కొనుగోలు చేయాలన్నా, అమ్ముకోవాలన్నా అనంతపురంతోపాటు కర్నాటక ప్రాంతాలకు వెళ్లేవారు. యార్డు ఛైర్‌పర్సన్ లక్ష్మీదేవి, వైస్ ఛైర్మన్ కోనంకి రాజశేఖర్, వాల్మీకి ఫెడరేషన్ రాష్ట్ర డైరెక్టర్ వైసిపి రమేష్‌లతో కలిసి శుక్రవారం స్థానిక యార్డులో పశువుల, గొర్రెల సంత ప్రారంభించారు. ఈ సందర్భంగా ఛైర్‌పర్సన్ మాట్లాడుతూ కయ, విక్రయాల కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లడానికి రవాణా ఖర్చులు భారమవ్వడమే కాకుండా తక్కువ ధరకే అమ్ముకునే దుస్థితి ఉండేదన్నారు. అలాంటి భారం లేకుండా చేయాలనే ఉద్దేశంతోనే సంతను ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వంశీకృష్ణభార్గవ్, యార్డు డైరెక్టర్లు, టిడిపి నాయకులు, యార్డు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



గొర్రెల సంతను పరిశీలిస్తున్న యార్డు ఛైర్‌పర్సన్ లక్ష్మీదేవి

చదువుతోపాటు క్రీడలూ అవసరమే..

ఎస్‌కెయు స్పోర్ట్స్ బోర్డుసెక్రటరీ బి.జెస్సీ

ప్రజాశక్తి-అనంతపురం

విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు చాలా ముఖ్యమని శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ బి.జెస్సీ సూచించారు. శుక్రవారం స్థానిక ఎస్‌వి డిగ్రీ, పీజీ కళాశాల, ఎస్‌కెయు సంయుక్త ఆధ్వర్యంలో ఎస్‌వి కళాశాల ఛైర్మన్ సి.సోమశేఖర్‌రెడ్డి అధ్యక్షతన అంతర్ కళాశాలల గ్రూప్-ఎ క్రీడాపోటీలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలు విద్యార్థుల్లో మానసిక ఉల్లాసాన్ని పెంచుతాయన్నారు. ఈ టోర్నమెంట్‌లో వాలీబాల్, సాఫ్ట్‌బాల్, చెస్, బాల్ బాడ్మింటన్, యోగా, టేబుల్ టెన్నిస్ వంటి క్రీడల్లో విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఆర్గనైజింగ్ ఛైర్మన్ ఎన్‌ఎవి ప్రసాద్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ టి.శ్రీనివాసులు, కళాశాల అడ్మినిస్ట్రేటివ్ అధికారి ఎ.శ్రీనాథ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎం.శ్రీనివాసులునాయక్, క్రీడాకారులు, అధ్యాపకులు పాల్గొన్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న వక్తలు

వల్లభ్‌భాయ్ పటేల్ సేవలు స్ఫూర్తిదాయకం : ఎస్పీ

ప్రజాశక్తి-అనంతపురం

దేశానికి సర్దార్ వల్లభాయ్ పటేల్ చేసిన సేవలు స్ఫూర్తిదాయకం, ప్రశంసనీయమని ఎస్పీ పి.జగదీష్ కొనియాడారు. పటేల్ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయం ఆవరణలోని పోలీసు అమరవీరుల స్థూపం వద్ద జాతీయ ఏకత్వ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఇందులో భాగంగా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జాతీయ సమైక్యతకు పాటుపడిన సర్దార్ వల్లబాయ్ పటేల్ సేవలును గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం ఐక్యతాభావం పెంపొందేలా కార్యక్రమంలో పాల్గొన్న అందరితో ప్రతిజ్ఞ చేయించారు. కాగా జిల్లా పోలీసు హెడ్ క్వార్టర్స్ నుంచి ప్రారంభమైన ఐక్యతా పరుగు గిల్డ్ ఆఫ్ సర్వీస్ రోడ్డు, సుభాష్ రోడ్డు మీదుగా టవర్‌క్లాక్, కోర్టు రోడ్డు, పోలీసు పరేడ్ మైదానం నుంచి తిరిగి జిల్లా పోలీసు కార్యాలయంలోని అమరవీరుల స్థూపం వరకు సాగింది. అనంతరం వివిధ పోటీల్లో రాణించిన విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎఆర్ అదనపు ఎస్పీ ఇలియాజ్‌బాషా, అనంతపురం డీఎస్పీ వి.శ్రీనివాసరావు, రూరల్ డీఎస్పీ టి.వెంకటేశులు, ఎఆర్ డీఎస్పీ నీలకంఠేశ్వరరెడ్డి, సిఐలు ధరణీకిశోర్, క్రాంతికుమార్, వెంకటేశ్వర్లు, రాజేంద్రనాథ్ యాదవ్, శ్రీకాంత్, జగదీష్, దేవానంద్, శేఖర్, ఆర్‌ఐ పవన్‌కుమార్, జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహాక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోక్‌నాథ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ఆర్‌ఎస్‌ఐ జాఫర్, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న ఎస్పీ జగదీష్, పోలీసులు

మట్టి, ఇసుక మాఫియాకు కేరాఫ్ వైసిపి

ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

ప్రజాశక్తి-పుట్లూరు

మట్టి, ఇసుక అక్రమ రవాణాకు కేరాఫ్ గత వైసిపి ప్రభుత్వమే అని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ శుక్రవారం తీవ్రంగా ఖండించారు. వైసిపి నాయకులు రాజకీయ ప్రయోజనాల కోసమే సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారన్నారు. గతంలో వైసిపి హయాంలో బుక్కరాయసము ద్రానికి కూతవేటు దూరంలో ఉన్న నక్కలదిప్ప, అడ్డదిప్ప, వంటి కొండలు మాయం చేసిన పరిస్థితిని ప్రజలు మరచిపోలేదని గుర్తు చేశారు. అలాంటి వారు నేడు మట్టి మాఫియా గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. మట్టి, ఇసుక మాఫియాకు కేరాఫ్ అడ్రస్‌గా పని చేసిందన్నారు. ప్రస్తుతం జరుగుతున్న మట్టి రవాణా ప్రజల అవసర నిమిత్తం మాత్రమే అన్నారు. ప్రజా అనుగుణంగా, ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా రవాణా సాగుతోందన్నారు. అనవసరమైన ఆరోపణలు పూర్తిగా నిరాధారమన్నారు. ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించే వారు ఎవరైనా.. ఏ రాజకీయ పార్టీకి చెందిన వారైనా.. కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.



పారదర్శక సేవలే ప్రామాణికం

అహుడా ఛైర్మన్ టిసి వరుణ్

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

పారదర్శక సేవలే ప్రామాణికంగా అహుడా సేవలు అందిస్తుందని అహుడా ఛైర్మన్ టీసీ వరుణ్ అన్నారు. శుక్రవారం స్థానిక అహుడా కార్యాలయంలో వైస్ ఛైర్‌పర్సన్ శివ్‌నారాయణ్‌శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా అహుడా అధికారులకు పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. గతంలో ఉన్న ఒక కుటుంబానికి, ఒక ప్లాట్ నిబంధన ఎత్తివేశామన్నారు. ఆసక్తి ఆర్థికస్థోమత ఉన్నవారు ఎన్ని ప్లాట్లు అయినా కొనుగోలు చేసే సౌలభ్యం కల్పించామన్నారు. అందుకు పారదర్శకంగా అహుడా ఎన్టీఆర్ స్మార్ట్ లేఔట్లలో ఈవేలం నూతనంగా అమలు చేయనున్నామని తెలిపారు. ఇందుకు సంబంధించిన వెబ్‌సైట్, ప్లాట్ల ధరలు, ఇతరత్రా ప్రాధాన్యత అంశాలపై చర్చించారు.



సమావేశంలో మాట్లాడుతున్న టిసి వరుణ్

పశువులకు గర్భకోశ వ్యాధి చికిత్స చేయించండి

జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి పి.ప్రేమ్‌చంద్

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

రైతులు తప్పనిసరిగా పశువులకు గర్భకోశ వ్యాధి చికిత్స చేయించుకోవాలని జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ ప్రేమ్‌చంద్ సూచించారు. రాష్ట్రీయ గోకుల్ మిషన్, జిల్లా పశు గణాభివృద్ధి సంఘం, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని కొట్టాలపల్లి గ్రామంలో ఉచిత గర్భకోశ వ్యాధి చికిత్స శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరాన్ని ఎంపిపి దాసరి సునీత ప్రారంభించారు. ఇందులో భాగంగా 42 పాడిపశువులకు ఉచిత గర్భకోశ చికిత్సలు చేశారు. తర్వాత ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సహాయ సంచాలకులు డాక్టర్ రత్నకుమార్, డాక్టర్ ప్రకాష్, అనంతపురం సహాయ సంచాలకులు ప్రకాష్, రామచంద్రారెడ్డి, అనంతపురం పశు వైద్యాధికారి డాక్టర్ శ్రీకాంత్, జిల్లా కార్యనిర్వహణ అధికారి డాక్టర్ వెంకటేష్, అనంతపురం ఉప సంచాలకులు రమేష్‌రెడ్డి, బుక్కరాయసముద్రం, రాప్తాడు ప్రాంతీయ పశు వైద్యశాలల సహాయ సంచాలకులు రత్నకుమార్, ప్రకాష్, వైద్యులు పద్మనాభం, ఆత్మ పీడీ పద్మలత, పశు గణాభివృద్ధి సంఘం డాక్టర్ శ్రీకాంత్, రెడ్డిపల్లి ఆర్ఎహెచ్‌టిసి వినోద్‌కుమార్, రెడ్డిపల్లి కెవికె డాక్టర్ మాధవి, పారా సిబ్బంది రామాంజనేయులు, తేజస్విని, రాజేంద్ర, శివయ్య, గోపాలమిత్ర బాలకొండ, చిన్నకొండయ్య , సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.



పశువైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపిపి దాసరి సునీత

నియామకాల్లో నిబంధనల ఉల్లంఘనకు తావివ్వొద్దు

కలెక్టర్ ఓ.ఆనంద్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

ఐసిడిఎస్‌లోని ఖాళీపోస్టుల నియామకాల్లో నిబంధనల ఉల్లంఘనకు తావివ్వొద్దని కలెక్టర్ ఓ.ఆనంద్ ఆదేశించారు. అనంతపురం కలెక్టరేట్ రెవెన్యూ భవనంలో శుక్రవారం జిల్లా మహిళా శిశుసంక్షేమ శాఖ (ఐసిడిఎస్)పై జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఐసిడిఎస్‌లో ఖాళీలను భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ ఇవ్వాలన్నారు. ఐసిడిఎస్ పరిధిలో జిల్లాలో వర్కర్లు 36, హెల్పర్లు 68 మంది కలిపి మొత్తం 104 పోస్టులకు సంబంధించి ఖాళీలను భర్తీ చేయాలని, ఈ విషయమై రోస్టర్లు సక్రమంగా పెట్టి వచ్చే మూడు, నాలుగు రోజుల్లో ఫైల్ సర్క్యులేట్ చేయాలని ఆదేశించారు. వర్కర్లు, హెల్పర్ల నియామకంలో నిబంధనలకు విరుద్ధంగా చేస్తే చర్యలు తీసుకుంటామని, నియామకాల్లో నిబంధనల ఉల్లంఘన ఉండడానికి వీలులేదని, రిజిస్ట్రేషన్ ఉంటే సరిగా చూసుకోవాలని చెప్పారు. వివరాలను జిల్లా వెబ్‌సైట్ లో అప్లోడ్ చేయాలన్నారు. చిన్నారుల నమోదు (ఎన్రోల్మెంట్)కు సంబంధించి ఎట్టి పరిస్థితుల్లోనూ ఫిజికల్ డేటాకు, ఆన్‌లైన్ డేటాకు తేడా ఉండరాదన్నారు. జిల్లాలో అండర్ వైట్‌కు సంబంధించి సివియర్ కేటగిరీలో 5 వేల మంది పిల్లలు ఉన్నారని, సూపర్వైజర్లు ప్రతి నెల సివియర్ కండిషన్‌లో ఉన్న కేసులను మానిటర్ చేయాలని చెప్పారు. క్షేత్రస్థాయిలో సూపర్‌వైజర్లు బాగా పని చేస్తే ఐసిడిఎస్ శాఖ బాగుంటుందన్నారు. ఈ సమావేశంలో ఐసిడిఎస్ పీడీ అరుణకుమారి, డిఎంహెచ్ఒ డాక్టర్ ఈబి.దేవి, డిసిపిఒ మంజునాథ్, డిస్ట్రిక్ మిషన్ వాత్సల్య, మిషన్ శక్తి కోఆర్డినేటర్ డాక్టర్ బి.ఎన్.శ్రీదేవి, సూపర్‌వైజర్లు, సిడిపిఒలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ఓ.ఆనంద్

శ్రీశ్రీ కళావేదిక రాష్ట్ర అధ్యక్షులుగా గుత్తా హరి



అనంతపురం : శ్రీశ్రీ కళావేదిక రాష్ట్ర అధ్యక్షులుగా గుత్తా హరి నియమితులయ్యారు. అంతర్జాతీయ సాహిత్య, సాంస్కృతిక, సామాజిక సేవాసంస్థ శ్రీశ్రీ కళావేదిక ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని ప్రకటించింది. ఇందులో అన్ని జిల్లాలకు తగిన ప్రాతినిధ్యం కల్పించారు. ఈ సందర్భంగా ఎపి రాష్ట్ర అధ్యక్షునిగా ప్రముఖ కవి, సామాజిక కార్యకర్త, సీనియర్ జర్నలిస్ట్ గుత్తా హరి సర్వోత్తమ నాయుడుకు రెండోసారి అవకాశం కల్పించారు. జాతీయ ఉపాధ్యక్షునిగా కూడా ఆయన సేవలు కొనసాగిస్తారని స్పష్టం చేశారు. రాష్ట్ర స్థాయిలో అనుబంధ విభాగాలకు కూడా పదవీస్థానం చేసేందుకు తగిన చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. నూతనంగా ఎంపికైన పూర్తి కార్యవర్గాన్ని ఈశ్వరీభూషణం ప్రకటించారు.

టిడిపి నాయకుడి మృతికి నివాళి

నార్పల : మండలంలోని గూగూడు గ్రామ టిడిపి సీనియర్ నాయకులు రాజన్న మృతికి టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలం నరసానాయుడు, జిల్లా నాయకులు ఆలం వెంకట నరసానాయుడు నివాళులర్పించారు. గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రాజన్న మృతిచెందిన విషయం తెలిసిందే. దీంతో శుక్రవారం నిర్వహించిన అంత్యక్రియల్లో టిడిపి నాయకులు పాల్గొని నివాళులర్పించారు.

జిల్లా జట్టుకు ఎంపికైన తాడిపత్రి క్రీడాకారుడు

తాడిపత్రి : తాడిపత్రి ఆర్డీటీ సబ్ సెంటర్‌కు చెందిన బురనుద్దీన్ అండర్-14 జిల్లా జట్టుకు ఎంపికయ్యాడు. అనంతపురంలో జరిగిన అండర్-14 ప్రాబబుల్స్‌లో అత్యధిక పరుగులు సాధించి జిల్లా జట్టుకు ఎంపికయ్యాడు. దీంతో తాడిపత్రి మండలం క్రికెట్ అసోసియేషన్ సెక్రటరీ సాదిక్‌వలి, సీనియర్ క్రీడాకారులు కోచ్ భార్గవ్ హర్షం వ్యక్తం చేశారు

సబ్సిడీ పప్పుశనగను సద్వినియోగం చేసుకోండి

ఆత్మకూరు : మండలంలోని రైతులు సబ్సిడీ పప్పుశనగ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. మండలానికి వంద క్వింటాళ్ల పప్పుశనగను కేటాయించినట్లు తెలిపారు. ఇందులో భాగంగా పడమటి యాలేరు, ముట్టాల, ఆత్మకూరుకు చెందిన రైతులు వారి పరిధిలోని రైతుసేవా కేంద్రాలకు వెళ్లి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు.

వైస్‌ఎంపిపి రాజీనామా చేయాలి

బెలుగుప్ప : మండల పరిధిలోని తగ్గుపర్తి ఎర్రగుడి ఆవులెన్న నుంచి వైసిపి ఎంపిటిసిగా గెలుపొందిన వైస్ ఎంపిపి తగ్గుపర్తి పుష్పావతి వెంటనే రాజీనామా చేయాలని మండల వైసిపి నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం మండల పరిధిలోని ఎర్రగుడి గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ పుష్పావతి వైసిపి గుర్తుపై గెలిచి టిడిపిలోకి వెళ్లడం బాధాకరమన్నారు. పార్టీని వీడిన తర్వాత పదవికి కూడా రాజీనామా చేసి వెళ్లాలని సూచించారు. లేనిపక్షంలో మీ ఇంటి వద్దకు శాంతియుత ర్యాలీని నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వైసిపి నాయకులు అంగడి స్వామి, నరిగన్న, తగుపత్తి నరేంద్ర, పూల ప్రసాద్, చిన్నేరు స్వామి, రమేష్, శ్రీనివాస్, ఎర్రిస్వామి, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాడిపత్రిరూరల్ : తేరన్నపల్లి 33 కెవి విద్యుత్, 220 కెవి విద్యుత్ ఉపకేంద్రాల్లో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ అధికారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున తాడిపత్రి పట్టణ, తాడిపత్రి పరిసర గ్రామాలతోపాటు యాడికి, పరిసర గ్రామాల్లో అంతరాయం ఉంటుందన్నారు. కావున వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఇకెవైసి పూర్తి చేయండి : ఎపిడి



మాట్లాడుతున్న ఎపిడి పుల్లారెడ్డి

పుట్లూరు : మండలంలోని అన్ని పంచాయతీల్లో ఉపాధి హామీ పనుల కూలీల ఇకెవైసి త్వరగా పూర్తి చేయాలని ఎపిడి పుల్లారెడ్డి సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఫీల్డ్ అసిస్టెంట్ల సమావేశంలో ఎపిడి మాట్లాడుతూ కూలీల ఇకెవైసి చేయడంలో మండలం చాలా వెనుకబడి ఉందన్నారు. త్వరగా వందశాతం పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎపిఒ తులసీప్రసాద్, టిఎలు, బీఎఫ్‌టిలు, ఎఫ్ఎలు, తదితరులు పాల్గొన్నారు .

పారిశుధ్య పనులు పరిశీలన

ఆత్మకూరు : మండలంలోని యాలేరు, సనప, తోపుదుర్తి గ్రామాల్లో చేపట్టిన పారిశుధ్యం, తాగునీటి సరఫరా పథకాలను ఎంపిడిఒ జి.లక్ష్మీనరసింహ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు చెత్తను రోడ్లు, కాలువలపై వేయకూడదన్నారు. తడి, పొడి చెత్తన విడివిడిగా గ్రామ పంచాయతీ సిబ్బందికి అందజేసి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ సాదిక్‌వలి, పంచాయతీ కార్యదర్శులు మురళి, కమల్, పోతులయ్య, తదితరులు పాల్గొన్నారు.



పారిశుధ్యం పనులను పరిశీలిస్తున్న అధికారులు

కలెక్టర్‌ను కలిసిన మాజీ ఎమ్మెల్యే విశ్వ



కలెక్టర్‌కు బొకే అందజేస్తున విశ్వేశ్వరరెడ్డి

అనంతపురం : పిఎబిఆర్ డ్యామ్‌కు అనుకుని ఉన్న నల్లగట్టు వద్ద అక్రమ మైనింగ్‌ను ఆపాలని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి కోరారు. ఈమేరకు శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో కలెక్టర్ ఓ.ఆనంద్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విశ్వ మాట్లాడుతూ నల్లగుట్ట వద్ద మైనింగ్‌ను తరలివచడం ద్వారా డ్యామ్ రక్షణ ప్రమాదకరంలో పడిందన్నారు. ఉరవకొండ నియోజకవర్గానికి సంబంధించిన అధికార పార్టీ నాయకుల అండతోనే అక్రమ మైనింగ్ సాగిందన్నారు. వెంటనే బాధ్యులపై చర్యలు తీసుకుని డ్యాంను కాపాడాలని కోరారు.

అమరవీరుల వారోత్సవాలు



తాడిపత్రిలో మాట్లాడుతున్న ఎఎస్పీ రోహిత్‌కుమార్‌చౌదరి

ప్రజాశక్తి-తాడిపత్రి రూరల్

విద్య, ఉద్యోగావకాశాలు, మహిళలు, రోడ్డు భద్రతపై ప్రతి విద్యార్థికీ అవగాహన అవసరమని ఎఎస్‌పి రోహిత్‌కుమార్‌చౌదరి సూచించారు. పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం రూరల్ పరిధిలోని పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో తాడిపత్రి అప్‌గ్రేడ్ స్టేషన్ సిఐ శివగంగాధర్‌రెడ్డి, కళాశాల సిబ్బంది, విద్యార్థులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అనంతపురం : పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా స్థానిక ఇటుకలపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం నిర్వహించిన మెగా రక్తదాన శిబిరానికి అనూహ్య స్పందన కనిపించింది. వైద్య శిబిరాన్ని రూరల్ డీఎస్పీ డీఎస్పీ వెంకటేశ్వర్లు ప్రారంభించారు. ఇందులో భాగంగా 178 మందికి రక్తదానం చేశారు. రక్తదానం చేసిన వారికి ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐ హేమంత్‌కుమార్, ఎస్ఐ విజయ్‌కుమార్, పోలీస్ సిబ్బందితో పాటు విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం : పోలీస్ అమరవీరుల దినోత్సవం సందర్భంగా శుక్రవారం మండల కేంద్రంలో పోలీసులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ నుంచి ప్రారంభమైన ర్యాలీ స్థానిక పోలీస్‌స్టేషన్ వరకు సాగింది. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమాండ్ కేశవరెడ్డి, అసిస్టెంట్ కమాండెంట్ మహబూబ్‌బాషా, ఎస్సై రామ్‌ప్రసాద్, 14 బెటాలియన్ సిబ్బంది పాల్గొన్నారు.

3న కలెక్టరేట్ ముట్టడి

ప్రజాశక్తి-అనంతపురం

కౌలు రైతు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 3వతేదీన కలెక్టరేట్ ముట్టడిని విజయవంతం చేయాలని ఎపి కౌలు రైతుసంఘం ఉరవకొండ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి బోయ వెంకటేశులు పిలుపునిచ్చారు. శుక్రవారం వజ్రకరూరు మండల పరిధిలోని పొట్టిపాడు గ్రామంలో ఇందుకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేసి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కవులు రైతులకు నూతన కౌలు చట్టం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కౌల రైతులందరికీ పెట్టుబడి సాయం కింద అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించిన రూ.20వేలను కౌలు రైతుల ఖాతాల్లో జమ చేయాలన్నారు.కౌలు రైతులందరికీ ఎలాంటి షరతులు లేకుండా బ్యాంకులలో రుణాలు ఇచ్చి ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతుసంఘం నాయకులు రామాంజనేయులు, సుంకన్న, గోవిందు, ఓబన్న, సుంకన్న, కుళ్లాయప్ప, నల్లమ్మ, పెన్నయ్య, తదితరులు పాల్గొన్నారు.

దౌర్జన్యపరులపై చర్యలు తీసుకోవాలని వినతి

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్

మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో చింతచెట్లు నరికి వేయడంతోపాటు వైసిపి సానుభూతిపరుల ఇళ్లపైకి వెళ్లి దాడి చేసిన దౌర్జన్యపరులపై కేసులు నమోదు చేయాలని వైసిపి నాయకులు కోరారు. ఈమేరకు శుక్రవారం స్థానిక కార్యాలయంలో డీఎస్పీ రవిబాబును కలిసి వినతిపత్రం అందజేశారు. ఇందులో భాగంగా పట్టణ కన్వీనర్ సుధీర్, కొత్తూరు సర్పంచు నాగమణి భర్త బాబు, మాజీ మార్కెట్ యార్డు ఛైర్మన్ నారాయణ, మండల కన్వీనర్ గోళ్ల సూరి, మల్లికార్జున, గోపారం శ్రీనివాసులు, తదితరులు కొత్తూరు ఘటనపై డీఎస్పీకి వివరించారు. మొదటగా గొల్ల కిస్టప్ప, గొల్ల నాగన్న, ఊరుబావి గోవిందప్ప, బోయ నరసింహులుతో పాటు 8 మంది సుమారు 200 చింతచెట్లు దౌర్జన్యంగా నరికి వేశారన్నారు. దీనిపై ఫిర్యాదు చేస్తే కేసులు నమోదు చేయలేదన్నారు. జుంజరప్ప మరుసటిరోజు పాతలింగ ఇంటిపైకి ఊరుబావి గోవిందప్పతోపాటు ఆయన అనుచరులు వెళ్లి దాడిచేసి తీవ్రంగా గాయపరిచారని తెలిపారు. ఇందుకు స్పందించిన డీఎస్పీ గ్రామాల్లో ఘర్షణలకు దిగి అనవసరంగా ఇబ్బందులు తెచ్చుకోవద్దన్నారు. కేసులు కడుతూపోతే అన్నింటికీ పరిష్కారం ఉంటుందా.. అని ప్రశ్నించారు. అన్నివర్గాలపై కేసులు నమోదు చేస్తామని హామీ ఇచ్చారు.



డీఎస్పీ రవిబాబుతో చర్చిస్తున్న వైసిపి నాయకులు

శాస్త్రవేత్తల సలహాలు పాటిస్తే అధిక దిగుబడులు

వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

రైతులు శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు సూచించారు. శుక్రవారం వ్యవసాయ అధికారులు, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు సంయుక్తంగా శింగనమల మండలంలోని పోతురాజుకాలువ, పెరవలి, బండమీదపల్లి గ్రామాల్లో పర్యటించి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రసం పీల్చే పురుగుల బెడద నుంచి ప్రత్తిపంటను కాపాడేందుకు ఫ్లోనిక మైడ్ (ఉలలా) అనే మందును ఎకరాకు 60 గ్రాములు చొప్పున పిచికారి చేస్తే పంటను త్వరగతిన కాపాడుకోవచ్చన్నారు. గులాబీ రంగు పురుగు ఉధృతిని గమనించి లింగాకర్షక బుట్టల ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈసారి కంది పంట ఆశాజనకంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ (ఆత్మ) పద్మలత, జిల్లా రైతు శిక్షణ కేంద్రం వ్యవసాయ అధికారి రుమాన, కెవికె శాస్త్రవేత్త కిషోర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



కంది పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు

జాతీయ ఐక్యతను చాటిన గొప్ప వ్యక్తి 'పటేల్'

జెఎన్‌టియు విసి హెచ్.సుదర్శనరావు

ప్రజాశక్తి-అనంతపురం

దేశంలోని అనేక సంస్థానాలను భారత్ యూనియన్‌లో కలిపి జాతీయ ఐక్యతను చాటిని గొప్ప వ్యక్తి సర్దార్ వల్లబాయ్ పటేల్ అని జెఎన్‌టియు ఉపకులపతి హెచ్.సుదర్శనరావు కొనియాడారు. సర్దార్ వల్లబాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం స్థానిక జెఎన్‌టియులోని ఎపిజె అబ్దుల్ కలాం పరిపాలన భవనంలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విసి మాట్లాడుతూ దేశంలోని అనేక సంస్థానాలను భారత్ యూనియన్‌లో విలీనం చేయడానికి పట్టుదలతో వ్యవహరించిన వ్యక్తి పటేల్ అన్నారు. అందుకోసం భారత ప్రభుత్వం భారతరత్న ఉక్కుమనిషి బిరుదును ఇచ్చి గౌరవించిందన్నారు. ఆయన్ను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగుదామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఒఎస్‌డి వీసీ ఎన్.దేవన్న, రిజిస్ట్రార్ ఎస్.కృష్ణయ్య, ఇంజినీరింగ్ కళాశాలలో వైస్ ప్రిన్సిపాల్ ఎస్.వసుంధర, యూనివర్శిటీ డైరెక్టర్లు పిఆర్ భానుమూర్తి, ఎస్‌వి సత్యనారాయణ, బి.దుర్గాప్రసాద్, జివి సుబ్బారెడ్డి, నాగప్రసాద్, బి.ఈశ్వర్‌రెడ్డి, వైశాలి ఘోర్పడే, జి.ప్రశాంతి, సి.శోభాబిందు, కిరణ్మయి, సుజాత, దేవకుమార్, ఎపి శివకుమార్, బి.ఓంప్రకాష్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎస్.వసుంధర, ఫైనాన్స్ ఆఫీసర్ వెంకట శివారెడ్డి, డిఆర్‌లు, ఎఆర్‌లు తదితరులు పాల్గొన్నారు.

అలాగే జెఎన్‌టియు అనుబంధ తైల సాంకేతిక, ఔషధ పరిశోధనా సంస్థలో పటేల్‌క నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో ఒటిపిఆర్ఐ డైరెక్టర్ జివి సుబ్బారెడ్డి, ప్రిన్సిపాల్ సి.గోపీనాథ్, డిప్యూటీ రిజిస్ట్రార్ బి.దుర్గాప్రసాద్, ఒటిపిఆర్ఐ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎస్.లహరి పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న జెఎన్‌టియు విసి, తదితరులు



పొగాకుకు వాడకంపై అవగాహన కల్పిస్తున్న వక్తలు

యువత పొగాకుకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి-అనంతపురం

ప్రజలతోపాటు యువత పొగాకుకు దూరంగా ఉండాలని డిఇఒ ప్రసాద్‌బాబు, జిల్లా పొగాకు నియంత్రణ అధికారి జి.నారాయణస్వామి పిలుపునిచ్చారు. టోబాకో ఫ్రీ యూత్ కాంపెయిన్ 3.0 సందర్భంగా శుక్రవారం స్థానిక జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో పొగాకుకు వ్యతిరేకంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా సిగరెట్లు, ఇతర పొగాకు సంబంధింత ఉత్పత్తుల వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎడిలు మునీర్, శ్రీనివాసులు, సూపరింటెండెంట్ ఆదినారాయణ, జిల్లా పొగాకు నియంత్రణ సామాజిక కార్యకర్త బి.శ్రీరాములు, ఐటీ సెల్ శ్రీనివాసులు, చంద్రశేఖర్‌రెడ్డి, మంజునాథ్, రవీంద్ర, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా క్రికెట్ జట్టుకు ఎంపికైన ఎస్.రోహితీశ్వర్‌రాజ్

ప్రజాశక్తి-అనంతపురం

నగరంలోని 3వరోడ్డులో ఉన్న సాయివిజ్ఞాన్ స్కూల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థి ఎస్.రోహితీశ్వర్‌రాజ్ అండర్-14 ప్రాబబుల్స్‌లో 12 వికెట్లు తీసి టాప్ బౌలర్‌గా నిలిచి అనంతపురం జిల్లా జట్టుకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్లు ఎంపి శ్రీనివాసులు, సి.కరుణాకర్‌బాబు, పాఠశాల ప్రిన్సిపాల్ జి.లావణ్యరామ్, తదితరులు రోహితీశ్వర్‌రాజ్‌ను అభినందించారు.

రిటైర్డ్ ఉద్యోగికి సన్మానం

నార్పల : మండల కేంద్రంలోని ప్రాథమిక వైద్యశాలలో సూపర్‌వైజర్‌గా విధులు నిర్వహిస్తున్న ప్రమీల శుక్రవారం పదవీ విరమణ చేయడంతో డాక్టర్ యామియా భూషణ్ ఆధ్వర్యంలో సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఒ బాలాజీ, యునాని రఫీద్దీన్‌ఖాన్, సూపర్‌వైజర్ అక్కులప్ప, అకులప్ప, ల్యాబ్ టెక్నీషియన్ రవీంద్ర, ఫార్మాసిస్ట్ రాజేంద్ర, ఎఎన్ఎం సుమియా, అనసూయమ్మ, ఆశావర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

వైసిపి ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ

కళ్యాణదుర్గం రూరల్ : ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రయివేటీకరించడాన్ని నిరసిస్తూ వైసిపి ఆధ్వర్యంలో శుక్రవారం కళ్యాణదుర్గంలో పట్టణ కన్వీనర్ ఐ.సుధీర్, దొడగట్ట నారాయణ ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ గోళ్ల సూరి, పాపంపల్లి బాబు, గోపారం శ్రీనివాసులు, షేక్షావలి, ఎర్రంపల్లి కృష్ణమూర్తి, హబీబ్, జి.రామాంజి, జాకీర్, చరణ్, శ్రీనివాసులు, నాగరాజు, బిక్కి హరి, సురేష్, ఆరుణ, నాగలక్ష్మి, రిజ్వానా, మమత, వంశీ, ఓంప్రకాష్, బి.రామాంజి, మురళి, పరమేశప్ప, లక్ష్మణ్, డీసీ పల్లి నరేష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలలు ఏర్పాటు చేయాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-గుత్తి

గుత్తిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, బాలుర జూనియర్ కళాశాలలను ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి నవీన్‌యాదవ్ డిమాండ్ చేశారు. జిల్లావ్యాప్తంగా నెలకొన్న విద్యారంగ సమస్యల పరిష్కారానికై ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఈనెల 3 నుంచి 7వ తేదీ వరకూ చేపట్టనున్న జీపుయాత్రకు సంబంధించిన కరపత్రాలను శుక్రవారం గుత్తిలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ వసతిగృహ విద్యార్థులకు కాస్మోటిక్ ఛార్జీలు రూ.3వేలు ఇవ్వాలన్నారు. ప్రయివేటు విద్యాసంస్థల్లో ఫీజుల నియంత్రణ చట్టాన్ని తేవాలన్నారు. అనంతపురం నుంచి రాయదుర్గం వరకు నిర్వహించే జీపుయాత్రకు విద్యార్థులు తరలివచ్చి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు జస్వంత్, బాషా, సురేష్, అనిల్, మస్తాన్, తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ఎర్రమట్టి తరలించే వారిపై కేసులు : డీఎస్పీ

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

శింగనమల నియోజకవర్గంలో ఎర్రమట్టి తరలించే వారిపై కేసులు నమోదు చేస్తామని డీఎస్పీ వెంకటేశ్వర్లు హెచ్చరించారు. శుక్రవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ మాట్లాడుతూ ఇటీవల మండలంలో ఎర్రమట్టి తరలించిన 17 ట్రాక్టర్లు, మూడు టిప్పర్లు, మూడు జెసిబిలు, నాలుగు ఇటాచీలకు 2,64,991 జరిమానా విధించినట్లు తెలిపారు. నియోజవకర్గంలో అనమతులు లేకుండా ఎక్కడ ఎర్రమట్టి తరలించినా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సిఐలు పుల్లయ్య, కౌలుట్లయ్య, ఎస్ఐలు రామ్‌ప్రసాద్, గోవిందు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న డీఎస్పీ

ఎస్ఐను కలిసిన ఎంఆర్‌పిఎస్ నాయకులు

కళ్యాణదుర్గం రూరల్ : కంబదూరు మండల ఎస్ఐ ఎస్.లోకేష్‌ను ఎంఆర్‌పిఎస్ నాయకులు శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువా కప్పి పూలహారం వేసి సన్మానించారు. సన్మానించిన వారిలో ఎంఆర్‌పిఎస్ ప్రధాన కార్యదర్శి హెచ్.కుళ్లాయప్ప, గిరిజన హక్కుల సంఘం జిల్లా కార్యదర్శి రాజానాయక్, వెంకటపతి నాయక్, దొడగట్ట నాగరాజ్, తిమ్మాపురం రాజన్న, తదితరులు పాల్గొన్నారు.


భవిష్యత్తు తరాలకు వ్యవసాయమే జీవనాధారం

కళ్యాణదుర్గం టౌన్ : భవిష్యత్తు తరాల్లో ఎప్పటికైనా వ్యవసాయమే జీవనాధారమని స్థానిక కృషివిజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ చెంద్రాయుడు అన్నారు. శుక్రవారం స్థానిక వివేకానంద హైస్కూల్‌లో ఏక్తా దివస్ నేషనల్ యూనిటీడే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఆకాడమిక్ డైరెక్టర్ నరసింహాచారి, ప్రధానోపాధ్యాయుడు విశ్వనాథ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్యసేవలందించాలి : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి-గుంతకల్లు

స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో ఖాళీలను భర్తీ చేసి రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని డివైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి సురేంద్రబాబు డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న వైద్యుల, స్టాఫ్‌నర్సులు, అటెండర్ల పోస్టులను భర్తీ చేయడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేయడం మంచిది కాదన్నారు. ఆసుపత్రిలో తగినంత సిబ్బంది లేక రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. చేసేది లేక జిల్లా కేంద్రంలోని ఆసుపత్రులకు వెళ్తూ ప్రమాదాలకు గురై మృత్యువాత పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ప్రజాప్రతినిధులు, ఆసుపత్రి ఉన్నతాధికారులు స్పందించి ప్రజల ఆరోగ్యాలను కాపాడాలని, లేనిపక్షంలో పెద్దఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆవాజ్ నాయకులు షాషా, డివైఎఫ్ఐ నాయకులు కన్నయ్య, రామాంజి, జయరాం, ఎర్రిస్వామి, రాము, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న డివైఎఫ్ఐ నాయకులు

దంత పరిశుభ్రతపై అవగాహన

కళ్యాణదుర్గం రూరల్ : శ్రీచైతన్య పాఠశాలల అనంతపురం జోన్ ఎజిఎం సుబ్బారెడ్డి ఆదేశాల మేరకు శుక్రవారం స్థానిక శ్రీచైతన్య పాఠశాలలో దంతాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా డాక్టర్ సాధన మాట్లాడుతూ దంతాలను ఎలా రక్షించుకోవాలి.. ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే విషయాలను కులంకుశంగా వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఫిలిప్‌కుమార్, డీన్ తిప్పారెడ్డి, ప్రైమరీ ఇన్‌ఛార్జి లీలావతి, ప్రీ ప్రైమరీ ఇన్‌ఛార్జి హేమలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వాహనాలు వేలం

బ్రహ్మసముద్రం : మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ పరిధిలో పట్టుబడిన 10 ద్విచక్ర వాహనాలను ప్రొహిబిషన్, ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారిణి రేవతి ఆధ్వర్యంలో శుక్రవారం వేలంపాట నిర్వహించారు. ఇందులో రూ.21,500 ఆదాయం చేకూరింది. ఈ కార్యక్రమంలో ఎస్ఐ నరేంద్ర కుమార్, ట్రైన్ ఎస్ఐ చైతన్య పాల్గొన్నారు.

ఎన్ఎస్‌హెచ్ఆర్ ముఖ్య సలహాదారుడిగా విజయ రాఘవన్

ప్రజాశక్తి-అనంతపురం

జాతీయ మానవ హక్కుల సంఘం ముఖ్య సలహాదారుడిగా విశ్రాంత తహశీల్దార్ విజయ రాఘవన్ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర, జోనల్, జిల్లా ప్రతినిధులు ఆయన్ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా విజయ రాఘవన్ మాట్లాడుతూ నేషనల్ సొసైటీ ఫర్ హ్యూమన్ రైట్స్ (ఎన్ఎస్‌హెచ్ఆర్) సంస్థ గౌరవాధ్యక్షులు, ముఖ్య సభ్యులు తనపై విశ్వాసం ఉంచి పదవిని ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం పలువురు ఆయన్ను అభినందించారు. ఈ కార్యక్రమంలో సంస్థ తెలుగు రాష్ట్రాల అధ్యక్షులు, జిల్లా లీగల్ అడ్వైజర్ ఓబుళపతి, సభ్యులు కేశవ్, హరీష్, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

బొలేరో బోల్తా.. వ్యక్తి మృతి



మృతిచెందిన రాజన్న

కళ్యాణదుర్గం రూరల్ : కళ్యాణదుర్గం మండలం గోళ్ల గ్రామం దర్గా సమీపంలో బొలేరో వాహనం బోల్తా పడటంతో వ్యక్తి మృతిచెందాడు. మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. వివరాల్లో కెళ్తే.. శెట్టూరు మండలం గొల్ల రాజన్న (38) శెట్టూరు నుంచి పామిడికి బొలేరో వాహనంలో కూలీలను తీసుకెళ్తుండగా గోళ్ల దర్గా వద్దకు రాగానే టైర్ పగిలి బోల్తా పడింది. దీంతో బొలేరోలో ఉన్న గొల్ల రాజన్న అక్కడికక్కడే మృతిచెందాడు. మరి ఆరుగురు గాయాలయ్యాయి. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు స్థానికులు తెలిపారు. క్షతగాత్రులను అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

వ్యక్తిపై దాడికేసులో నలుగురు అరెస్టు

అనంతపురం : ఈనెల 29 వ తేదీ సాయంత్రం రామ్‌నగర్‌కు చెందిన శంకర్‌ను స్థానిక ఎడిసిసి బ్యాంకు కాలనీ వద్ద జనార్ధన్‌రెడ్డి, మరో నలుగురు కలిసి దాడి చేసిన ఘటనలో నలుగురిని అరెస్టు చేసినట్లు 4వ పట్టణ పోలీసులు తెలిపారు. శంకర్‌ను కారులో ఎత్తుకెళ్లి వడియంపేట సమీప పొలాల్లో ఇనుప రాడ్లు, డ్రిప్ వైర్, కట్టెతో దారుణంగా కొట్టారు. ఘటనపై అనంతపురం 4వ పట్టణ పోలీసుస్టేషన్‌లో హత్యాయత్నం కేసు నమోదు చేసి జనార్ధన్‌రెడ్డితో పాటు అతని స్నేహితులు శరత్‌బాబు, మందారం మహమ్మద్ తౌవిద్, హనుమంతురెడ్డిని అరెస్టు చేసినట్లు తెలిపారు.